క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ చూపుతున్న న్యాయవాదులు

పాకాల : స్థానిక కోర్టు ఆవరణలో త్రైత సిద్ధాంతం బంగారుపాళెం కమిటీ సభ్యులు తెలుగు యుగాది క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన జ్ఞాన తెలుగు కాలసూచిక ప్రతి ఒక్కరికి అర్థమయ్యేలా సరళంగా ఉందని వెల్లడించారు. అనంతరం న్యాయవాదులకు క్యాలెండర్లు పంచిపెట్టారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుస్వామినాయుడు, న్యాయవాదులు గౌరీశంకర్‌రాజు, సుబ్రమణ్యంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, చంద్రమోహన్, కమిటీ సభ్యులు బాలాజీ, మాధవరెడ్డి, నాగరాజ ఆచారి పాల్గొన్నారు.

'డ్రీమ్ చేజర్' పోస్టర్ విడుదల



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చిత్ర యూనిట్

తిరుపతి కల్చరల్ : నగరంలోని ప్రతాప్ థియేటర్‌లో శుక్రవారం డ్రీమ్ చేజర్- యద్భావం తద్భవతి చిత్రం పోస్టర్ ఆవిష్కరించారు. చిత్ర దర్శకుడు, హీరో తిలక్‌రాయల్ మాట్లాడుతూ నేటి యువత జీవన శైలి, ఆలోచనలను ప్రతిబింబించేలా సినిమా ఉంటుందని, ఈ నెల 18వ తేదీన ప్రతాప్ థియేటర్‌లోనే విడుదలవుతోందని వెల్లడించారు. కార్యక్రమంలో పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ చైర్మన్ డాక్టర్ జీఎస్ ప్రసాద్, రిటైర్డ్ సీఈఓ ఎస్.నాగరాజ శేఖర్, సచిన్ వివేక్, కెమెరామెన్ ధనుష్ పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతోనే లక్ష్య సాధన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రకాష్‌రెడ్డి

తిరుపతి సిటీ : విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేస్తేనే లక్ష్య సాధన సాధ్యమని రిమ్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.ప్రకాష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కళాశాలలో పీజీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించి ఉత్తమ లక్ష్యంవైపు విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ వై.కొండారెడ్డి, ఆనంద్‌రెడ్డి, విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

దేహం.. దేవుడు ఒక్కటే!



మాట్లాడుతున్న ఈషాప్రియ తీర్థ స్వామీజీ

తిరుపతి రూరల్ : ప్రకృతిలో మానవుని దేహం, దేవుడు ఒక్కటేనని ఉడిపి ఆడమూరు మఠం పీఠాధిపతి ఈషాప్రియ తీర్థ స్వామీజీ వెల్లడించారు. శుక్రవారం తిరుపతి రూరల్ మండలం వేమూరు దళితవాడలోని అంకాళమ్మ తల్లి ఆలయాన్ని ఆయన సందర్శించారు. స్వామీజీ మాట్లాడుతూ దుష్ట శిక్షణ, ధర్మరక్షణకు దేవుడే మానవ అవతారం ధరించి శ్రీకృష్ణుడిగా మన దేశంలోనే జన్మించారన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ సంజయ్‌కుమార్

తిరుపతి రూరల్ : మండలంలోని తనపల్లె వద్ద శశి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఎన్‌సీసీ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై పోలీసులు శుక్రవారం అవగాహన కల్పించారు. ట్రాఫిక్ సీఐ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ రోడ్డుపై నడిచేప్పుడు, ద్విచక్ర వాహనంలో ప్రయాణించేప్పుడు, కారులో వెళ్లేప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

భగవంతుడు నాద ప్రియుడు



మాట్లాడుతున్న మేడసాని మోహన్

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : భగవంతుడు నాద ప్రియుడని, సంకీర్తనలు ఆలపించే చోట కొలువై ఉంటాడని అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి డాక్టర్ మేడసాని మోహన్ తెలిపారు. శుక్రవారం మహతి కళాక్షేత్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్నమాచార్య సంకీర్తనల ప్రచారంలో కళాకారుల కృషిని మరువలేమన్నారు. కళాకారులు మణి, లోకనాథరెడ్డి గాత్ర యుగళ కచేరీ ప్రేక్షకులను ఆకట్టుకుంది.

ఊడిపోయి.. విరిగిపోయి!

తిరుపతి బైరాగిపట్టెడలోని బాబు జగజ్జీవన్ రామ్ పార్కు అస్తవ్యస్తంగా తయారైంది. నిర్వహణలోపంతో అధ్వాన్నంగా మారింది. ప్రధానంగా ఓపెన్ జిమ్‌లో పరికరాలు తుప్పు పట్టి విరిగిపోయాయి. కొన్ని ఊడిపోయి ప్రమాదకరంగా మారిపోయాయి. దీంతో నిత్యం వ్యాయామం చేసేందుకు వచ్చేవారు నానా అవస్థలు పడుతున్నారు. తుడా అధికారులు పట్టించుకోకపోవడంపై సందర్శకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పార్క్‌లోని ఓపెన్ జిమ్‌ను ఆధునికీకరించాలని నగరవాసులు కోరుతున్నారు. – తిరుపతి తుడా





పార్క్‌లోని ఓపెన్ జిమ్‌లో రెండు ముక్కలైన ఊయల, సైక్లింగ్ ఫెడల్ విరిగిన దృశ్యం. ఒక్క ఫెడల్‌నే తొక్కుతున్న వృద్ధురాలు, నిరుపయోగంగా వ్యాయామ పరికరం

నోటీస్ బోర్డు

- భజన భక్తమండలి ఆధ్వర్యంలో ఉదయం 4.45 గంటలకు శ్రీగోవిందరాజస్వామి ఆలయ మాడ వీధులలో నగర సంకీర్తన.
- శ్రీనివాసపురం సబ్‌స్టేషన్‌లోని మరమ్మతుల కారణంగా న్యూ ఇందిరానగర్, ఎస్‌జీఎస్ కాలేజీ రోడ్డు, ఎస్‌టీవీ నగర్, గీతా నగర్, ఆంధ్ర స్పైస్ ఏరియా, ఎస్‌బీఐ కాలనీలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం.
- అన్నమయ్య 618వ జయంతోత్సవాల సందర్భంగా ఉదయం 10 గంటలకు అన్నమాచార్య కళామందిరంలో సాహితీ సదస్సు, సాయంత్రం 6 గంటలకు అన్నమాచార్య కళామందిరం, మహతి కళాక్షేత్రంలో సంకీర్తనలు.
- ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల్లో భాగంగా మూడోరోజు ఉదయం 11 గంటలకు కచ్చపి ఆడిటోరియంలో ప్రతినిధుల సభ.
- ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా స్విమ్స్‌లోని పద్మావతి ఓపీడీ బ్లాక్‌లో ఉదయం 11 గంటలకు రక్తపోటుపై అవగాహన సదస్సు.

కబ్జాకోరల్లో కంఠం!

తిరుపతి రూరల్ మండలం కూపుచంద్రపేటలో గ్రామ కంఠం భూమిని టీడీపీకి చెందిన ఓ మహిళా నేత ఆక్రమించేశారు. గ్రామస్తులు వారిస్తున్నా పట్టించుకోకుండా దౌర్జన్యంగా ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టారు. వినాయకుడి గుడి కోసం కేటాయించిన స్థలం కబ్జాపై స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. రూ.లక్షల విలువైన భూమి అన్యాక్రాంతమవుతున్నా స్పందించకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో కేసీపేట వాసులు ఆందోళనకు దిగేందుకు సన్నద్ధమవుతున్నారు.

- కేజీపేటలో గ్రామ కంఠం ఆక్రమణ
- ఆలయానికి కేటాయించిన భూమిలో ప్రహరీగోడ నిర్మాణం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- ఆందోళనకు దిగుతామంటున్న స్థానికులు



ఆక్రమిత స్థలంలో గోడ నిర్మిస్తున్న దృశ్యం

తిరుపతి రూరల్ : మండలంలోని కేసీపేట రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 260లో సుమారు రూ.30లక్షలు విలువైన గ్రామ కంఠం భూమి ఉంది. ఆ స్థలాన్ని అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత కబ్జా చేసి ఏకంగా ప్రహరీ నిర్మాణం చేపట్టడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తరతరాలుగా కాపాడుకుంటూ వచ్చిన భూమిని అడ్డగోలుగా కాజేసిన ఆమెపై చర్యలు తీసుకుని గోడను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో సదరు భూమిలోనే రచ్చబండతోపాటు అతిపెద్ద రావిచెట్టు కూడా ఉండేదని వెల్లడిస్తున్నారు. దురాలోచనలతో ఆ చెట్టు మొదళ్లపై యాసిడ్ పోసి చంపేశారని, తర్వాత క్రమంగా రచ్చబండను తొలగించారని ఆరోపిస్తున్నారు.

అధికార పార్టీ నేతల అండతోనే..

టీడీపీ ముఖ్యనేత అండదండలతోనే కబ్జా భూమిలో గోడ కట్టారని, అక్కడే టీడీపీ జెండా ఏర్పాటుకు దిమ్మెను కూడా నిర్మిస్తున్నట్టు గ్రామస్తులు చెబుతున్నారు. వినాయకుడి ఆలయ నిర్మాణం కోసం కేటాయించిన స్థలం కబ్జా చేయడంపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు పలుమార్లు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. అయినా సరే గోడ నిర్మాణం పూర్తయ్యేంత వరకు అధికారులు అటువైపు రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 24 గంటల్లో ఆ గోడను అధికారులు తొలగించకుంటే తామే తొలగిస్తామని స్పష్టం చేస్తున్నారు. అలాగే కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.



గతంలో ఉన్న రచ్చబండ, రావి చెట్టు (ఫైల్)

నిధుల విడుదలకు డిమాండ్



జిల్లా రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్‌లు

తిరుపతి రూరల్ : పంచాయతీలకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి రావాల్సిన సర్‌చార్జి, స్టాంప్ డ్యూటీ నిధులను వెంటనే విడుదల చేయాలని తిరుపతి రూరల్ మండలం సర్పంచులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు జిల్లా రిజిస్ట్రార్ జి.శ్రీరామ్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. సాయి నగర్ సర్పంచ్ డీవీ రమణ మాట్లాడుతూ ఏడాది నుంచి నిధుల బకాయి ఉన్నట్లు వెల్లడించారు. దీంతో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు ఇబ్బందిపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన జిల్లా రిజిస్ట్రార్ మాట్లాడుతూ వారంలోపు పంచాయతీలకు రావలసిన నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఈక్రమంలోనే సర్పంచ్‌లు జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవికి సైతం వినతి పత్రం సమర్పించారు. తగు చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లింగేశ్వర్‌నగర్ సర్పంచ్ కోటేశ్వరరావు, అవిలాల సర్పంచ్ సి. వెంకటరమణ, ఓటేరు సర్పంచ్ లక్ష్మీరాజ, బ్రాహ్మణపట్టు సర్పంచ్ సుబ్రమణ్యంరెడ్డి, రామానుజపల్లె సర్పంచ్ రవి పాల్గొన్నారు.

'ప్రార్థన'లపై వాగ్వాదం



పోలీసు స్టేషన్ వద్ద చర్చి నిర్వాహకులు

చంద్రగిరి : మండలంలోని తొండవాడ జగనన్న కాలనీలో ఎగ్మోర్ ప్రార్థన మందిరం పేరుతో ఎలాంటి అనుమతులు లేకుండా చర్చి ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు మండిపడ్డారు. శుక్రవారం ఈ మేరకు చర్చి నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. సూళ్లూరుపేటకు చెందిన కొందరు వ్యక్తులు అనధికారికంగా చర్చిని ప్రారంభించి రెండు రోజులుగా డీజేలు పెట్టి ఇబ్బందులకు గురిచేసినట్లు స్థానికులు ఆరోపించారు. ఈ క్రమంలోనే నిర్వాహకులు స్థానిక మహిళలపై దౌర్జన్యానికి దిగడంతో ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్థానికేతరులు ఇళ్ల మధ్య చర్చిని ఏర్పాటు చేసి మైక్‌లు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, మాత మార్పిడులకు చర్యలు చేపడుతున్నారని స్థానిక మహిళలు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు ఏమాత్రం సమస్యను పరిష్కరించకుండా, రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లాలని పంపించేశారు.

'భవిత' సేవలు ప్రత్యేకం



పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

పాకాల : విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక సేవలు అందించేందుకే ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసిందని జిల్లా సహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల సర్వే, భవిత కేంద్రంలోని పిల్లలను పాఠశాలలో నమోదు చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నేంద్రగుంట, ఉప్పువంక, దేశిరెడ్డిపల్లె, ఇరంగారిపల్లె, గాంధీనగర్‌లో ఈమేరకు సహిత ఉపాధ్యాయులు చేపట్టిన సర్వేను పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతూ భవిత కేంద్రంలో స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, ఎంఆర్ ఇంటర్‌వెన్షన్ వంటి సేవలు అందిస్తున్నారన్నారు. అలాగే పిల్లలకు అవసరమైన ఉపకరణాలను ఉచితంగా అందజేస్తున్నారని వివరించారు. సహిత ఉపాధ్యాయులు ఎం.మునికృష్ణారెడ్డి, కేఎస్ఎల్ సుందరి పాల్గొన్నారు.

ఘనంగా.. తిరంగా

జై భారత్.. జై జవాన్ నినాదాలతో తిరునగరం మార్మోగింది. ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా భారీ మువ్వన్నెల జెండా చేతపట్టి ప్రజానీకం కదంతొక్కింది. శుక్రవారం ఈ మేరకు అన్నమయ్య కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి సంఘీభావం తెలిపింది. వీర సైనికుల త్యాగాలను స్మరించుకుని ఉద్వేగభరితంగా జోహార్లర్పించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



సనాతన ధర్మం.. అన్నమయ్యతో విశ్వవ్యాప్తం



మాట్లాడుతున్న శేష శైలేంద్ర

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : సనాతన ధర్మంతోపాటు మన సంస్కృతిని అన్నమయ్య విశ్వవ్యాప్తం చేశారని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఇన్ కంట్యాక్స్ కేఎస్‌పి శేష శైలేంద్ర తెలిపారు. తాళ్లపాక అన్నమయ్య 617వ జయంతోత్సవాల్లో భాగంగా శుక్రవారం అన్నమాచార్య కళామందిరంలో నిర్వహించిన సాహితి సదస్సులో ఆయన పాల్గొన్నారు. అన్నమాచార్య సంకీర్తనలు – నవవిధ భక్తిమార్గాలు అనే అంశంపై మాట్లాడారు. గౌరిపెద్ది వేంకట శంకర భగవాన్ మాట్లాడుతూ అన్నమయ్య కీర్తనలు–భగవద్గీత సందేశం అనే అంశాలను వివరించారు. పొన్నా కృష్ణమూర్తి అన్నమయ్య సంకీర్తనలలో సామాజిక చైతన్యం– ముక్తి మార్గం అనే అంశంపై మాట్లాడారు. ఈ క్రమంలోనే అన్నమాచార్యుల సంకీర్తనలను బ్రెయిలీ లిపిలో డాక్టర్ బాగేపల్లి ఈశ్వరి రూపొందించిన పుస్తకాన్ని శేష శైలేంద్ర ఆవిష్కరించారు. రఘునాథ్ బృంద సంగీత సభ, ప్రమీల బృందం హరికథ అలరించాయి.

సమాజ హితమే లక్ష్యం

తిరుపతి కల్చరల్ : సమాజ హితమే లక్ష్యంగా విశేష సంపర్క విభాగం కృషి చేస్తోందని వీహెచ్‌పీ అఖిల భారత నేత సంజయ్ దావళికర్ తెలిపారు. శుక్రవారం వరదరాజనగర్‌లోని ఓ ప్రైవేట్ హాల్‌లో విశేష సంపర్క విభాగం జిల్లా విశిష్ట వ్యక్తుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సంజయ్ దావళికర్ మాట్లాడుతూ అయోధ్య రామ జన్మభూమి ఉద్యమ సమయంలో విశేష సంపర్క విభాగం పురుడుపోసుకుందని తెలిపారు. అనంతరం ఆయనను సంపర్క విభాగం నేతలు ఘనంగా సత్కరించారు. నేతలు కోటేశ్వరరావు, ప్రతాప్‌రెడ్డి, పి.సందీప్, సుధాకర్ బాబు, దిండుకుర్తి నరసింహులు, భరణీకృష్ణ, వసుంధర, విష్ణు, కిరీటి పాల్గొన్నారు.



సంజయ్ దావళికర్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

యువతతోనే రాజ్యాంగ రక్షణ



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

తిరుపతి కల్చరల్ : ప్రజాస్వామ్యంపై అవగాహన, గౌరవం లేని శక్తులు దేశాన్ని పాలిస్తున్నాయని, ఈ పరిస్థితుల్లో యువతతోనే రాజ్యాంగ రక్షణ సాధ్యమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తెలిపారు. ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల్లో భాగంగా రెండో రోజు కచ్చపి ఆడిటోరియంలో ప్రతినిధుల సభ నిర్వహించారు. నారాయణ మాట్లాడుతూ బీజేపీ పాలనలో రాజ్యాంగ వ్యవస్థలు అవమానించబడుతున్నాయని ఆరోపించారు. దీనిపై యువత అప్రమత్తం కావాలని కోరారు. జస్టిస్ జాస్తి చలమేశ్వర్ మాట్లాడుతూ దేశంలో నేటికీ పేదరికం, ఆకలి, వివక్షత కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నేతలు రావుల వెంకయ్య, సుందర్‌రాజన్, జగదీష్‌కుమార్, బీవీవీ కొండలరావు, పెరియార్ స్వామి పాల్గొన్నారు.

విద్యా సంస్కరణలపై ఆందోళన



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

తిరుపతి కల్చరల్ : ప్రభుత్వ పాఠశాలలను విద్యా సంస్కరణలు నిర్వీర్యం చేస్తాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం యశోదనగర్‌లోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో వారు మాట్లాడారు. జీవో 117ను రద్దు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం క్లస్టర్ పేరుతో వేలాది ఉపాధ్యాయ పోస్టులను తొలగించే కుట్ర చేస్తోందని విమర్శించారు. పేద పిల్లలు చదువుతున్న పాఠశాలలను మూసివేయాలని చూడడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సర్కారు బడులను కాపాడాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్ పాల్గొన్నారు.

దళితులపై దాడి అమానుషం

తిరుపతి కల్చరల్ : నగరంలోని 50 డివిజన్ కార్పొరేటర్ అనిల్‌పై జనసేన నేతలు దాడి చేయడం అమానుషమని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు కల్లూరి చెంగయ్య మండిపడ్డారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దళితుడని చూడకుండా అనిల్, కుటుంబసభ్యులను గాయపరచడం హేయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

కోన.. సమస్యలు తీరేనా?



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకులు.. చెత్తపై సమరం అంటూ ఆర్భాటపు ప్రకటనలు.. పరిశుభ్ర తిరుపతే లక్ష్యం అంటూ నిత్యం నగరంలో పర్యటనలు.. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. ప్రధానంగా జీవకోనలో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసింది. రహదారుల మాట ప్రస్తావించకపోవడమే మంచిదనే దుస్థితి దాపురించింది. రాజీవ్‌గాంధీ కాలనీ మార్గంలోని రాఘవేంద్రనగర్ సర్కిల్ వద్ద రోడ్డు గుంతలమయంగా మారింది. ఆరు నెలల క్రితం పైప్‌లైన్ వేసేందుకు దారిన తవ్వేసి.. అలాగే వదిలేశారు. దీంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే మాధవనగర్‌లోని బాలగంగమ్మ ఆలయ సమీపంలో బ్రెడ్ ఫ్యాక్టరీ వద్ద మురుగు కాలువ చెత్తాచెదారంతో నిండిపోయింది. రోజుల తరబడి శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. – తిరుపతి మంగళం



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

తిరుపతి : 99516 02971

చంద్రగిరి : 95055 17845